బాస్కెట్‌బాల్ జాతీయ పోటీకి వాల్మీకిపురం క్రీడాకారుడు

వాల్మీకిపురం: స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తనకంటి లక్ష్మినారాయణ కుమారుడు తనకంటి ప్రవీణ్ ఈ నెల 11 నుంచి 13వ తేది వరకు విజయవాడలోని పివి సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో తన ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీకి ఎంపికైనట్లు బాస్కెట్ బాల్ జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన ప్రవీణ్ రాష్ట్ర జట్టులో చురుకుగా పాల్గొని, రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని పులుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మంచి ప్రతిభ, తెలివి తేటలు, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. తద్వారా తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, చదువుకున్న బడికి సేవ చేసే అవకాశం లభిస్తోందన్నారు. ఎల్లప్పుడు క్రీడల్లో పాల్గొనడం వలన అనారోగ్య సమస్యలు రాకుండా, మనిషి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. అనంతరం కోచ్ సాయిభార్గవ్, సెక్రటరీ రవిచందర్, పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం అమరనాథ రెడ్డి, పిడిలు మాండవ్య రెడ్డి, మధుబాబు రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజ, రవీంద్రరెడ్డి, శంకర, నాగేశ్వర, ఖదీర్‌బాషా అభినందించారు.

నోటిఫికేషన్ షురూ!

- 23వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు
- 24న పరిశీలన, 27న ఉపసంహరణ మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- 'స్థానిక' ఎమ్మెల్సీ ఏకగ్రీవమేనా?

జిల్లాలో శాసనమండలి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఫిబ్రవరి 16వ తేదీ వరకు మార్చి 16న కౌంటింగ్, మార్చి 21వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. 2023 మార్చిలో రాష్ట్రంలోని ఐదుగురు ఎంఎల్‌సిల పదవీ కాలం ముగియనున్న సంగతి తెలిసిందే. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల శాసనమండలి స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. జిల్లా అధికార యంత్రాంగం ఓటర్ల జాబితా నమోదు మొదలుకుని ఎన్నికల నిర్వహణ వరకు సర్వం సిద్ధం చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికలు ఏడాది ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం ఆసక్తికరంగా మారిందని చెప్పవచ్చనే చర్చ ఆసక్తికలిగిస్తోంది.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కడప-కర్నూలు-అనంతపురం పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ సహా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కౌంట్‌డౌన్ మొదలైంది. గురువారం జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, 27న ఉప సంహరణ, మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్ షెడ్యూల్‌ను అమలు చేయాల్సి ఉంది. ఈ నెల 16 నుంచి 23 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఛాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సాగనుంది. మార్చి 18న మహా శివరాత్రి, 19న ఆదివారం మినహా మిగిలిన రోజులన్నీ ఎన్నికల ప్రక్రియ యథాతథంగా సాగనుంది. 24న నామినేషన్ల పరిశీలన, 27న ఉపసంహరణ ప్రక్రియ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు చేపట్టే అవకాశం ఉంది. అనంతరం మార్చి 13న ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్, 16న కౌంటింగ్, 21 తేదీతో ఎన్నికల ఘట్టం ముగి యనుంది.

భారీగా ఓటర్ల జాబితా

ఉమ్మడి కడప జిల్లాకు చెందిన 911 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్‌లో పాల్గొనున్నట్లు తెలుస్తోంది. వీరిలో జడ్‌పిటిసిలు 50 మంది, ఎంపిటిసిలు 547, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు 314 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఉమ్మడి కడప- కర్నూలు- అనంతపురం జిల్లాలకు చెందిన 27,716 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. కడపలో 7,358, అన్నమయ్య 1,932, అనంతపురం 5,461, సత్యసాయి జిల్లా 3,199, కర్నూలు 5,364, నంద్యాల 4,402 మంది ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3,51,700 మంది ఓటర్లు పాల్గొనే అవకాశం ఉంది. కడప జిల్లాలో 82,300, అన్నమయ్యలో 21,00, కర్నూలులో 62,500, నంద్యాలలో 65,500, అనంతపురంలో 69 వేలు, సత్యసాయిలో 51,400 మంది ఓటర్లు పాల్గొనే అవకాశం ఉంది.

ఎన్నికల బరిలో ప్రముఖులు

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎంఎల్‌సి స్థానానికి పిడిఎఫ్ తరుపున పోతుల నాగరాజు, వైసిపి తరుపున వెన్నపూస రవీంద్రారెడ్డి, టిడిపి తరుపున రామ్‌గోపాల్‌రెడ్డి బరిలో ఉన్నారు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పిడిఎఫ్ తరపున కత్తి నరసింహారెడ్డి, వైసిపి తరుపున రామచంద్రారెడ్డి ప్రధాన అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారాలు సాగిస్తుండడం తెలిసిందే. పిడిఎఫ్ తరపున పోటీ పడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థులకు యుటిఎఫ్ ఇతర ఉపాధ్యాయ, యువజన సంఘాల మద్దతు లభించడం ఊపునిచ్చింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపికి చెందిన ఓటర్లు అత్యధికంగా ఉన్న నేపథ్యంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు ఉన్న సంగతి తెలిసిందే. ఏదేమైనా 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రీఫైనల్స్‌గా భావించే అవకాశాలు ఉన్నాయ నడంలో సందేహం లేదు.

'ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి'

కడప : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బరిలో ఉన్న ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, ప్రచార కార్యకర్తలు కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని కడప జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెసి సి.ఎం. సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. గురువారం ఉదయం కడప స్థానిక సంస్థల నియోజకవర్గపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా, ఆరోగ్యకర వాతావరణంలో సాగేందుకు నిబంధనలు సూచనలను ఆయన తెలియజేశారు. ప్రతి మండలంలో ఎంసిసి టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించండి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సజావు నిర్వహించేందుకు నియమించిన నోడల్ అధికారులు వారి విధులను సమర్థ వంతంగా నిర్వహించాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 13 నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ ట్రైనింగ్, మెటీరియల్, ట్రాన్స్పోర్ట్ మేనేజ్మెంట్లకు సంబంధించి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూ షన్, రిపోర్టింగ్ సెల్, డైలీ రిపోర్ట్స్, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలకు సంబంధించి నియమించిన నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను మరింత బాధ్యతాయుతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల నిబంధనల మేరకు మౌలిక వసతుల కల్పనకు పరిశీలించాలని, ఎన్నికల నిర్వహణకు మాస్టర్ ట్రైనర్లచే ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించాలన్నారు. పోలింగ్‌కు అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌ల తరలింపుకు తదితర అంశాలను అధికారులు సమన్వయంతో పనిచేసి తమ విధులను నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్‌ఒ సత్యనారాయణ, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

'రీ సర్వేను వేగవంతం చేయండి'

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి స్పందన, హౌసింగ్, రీ-సర్వే అగ్రికల్చర్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వేకు సంబంధించిన ప్రతి పని జాగ్రత్తగా పరిశీలించి చేయాలన్నారు. రీ సర్వే ద్వారా భూ సమస్యలన్నీ పరిష్కరించడం జరుగుతుందని, ఈ దిశగా అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు కావాల్సిన సూచనలు సలహాలను ఎప్పటికప్పుడు అందించి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పాడి రైతులు జగనన్న పాలవెల్లువ అమూల్ కేంద్రాలకు పాలు పోసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ గిరీష మాట్లాడుతూ జిల్లాలోని భూముల రీ సర్వేకు సంబంధించిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి గడువులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. తాహశీల్దార్లు, ఆర్డీవోలు వారానికి ఒకరోజు రీసర్వే జరుగుతున్న గ్రామాలను తప్పకుండా సందర్శించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే గ్రామాలలో రైతులందరికీ నోటీసులు జారీ చేసి సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 2022-23 రబీ ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ ద్వారా రైతులకు ప్రొక్యూర్మెంట్, ఇన్సూరెన్స్, ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వడం జరుగుతోందని, అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు ఏ పంట సాగు చేశారు, ఎన్ని ఎకరాల్లో వేశారు తదితర అన్ని రకాల వివరాలను పకడ్బందీగా వంద శాతం నమోదు చేయాలన్నారు. జిల్లాలో అమూల్‌కు పాల సేకరణ పక్కాగా జరగాలన్నారు. పాల సేకరణ కొరకు అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా మహిళలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో జగనన్న పాలవెల్లువ ప్రాముఖ్యతను పాడి రైతులకు తెలియజేసి అమూల్‌కు పాలు పోసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సంబంధిత హౌసింగ్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకుని లేఅవుట్ వారీగా ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని అధికారులను ఆదేశించారు. పీఎంఏవై గ్రామీణ్ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయాలన్నారు. అధికారులు స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్‌ఒ సత్యనారాయణ, డిపిఒ ధనలక్ష్మి, హౌసింగ్ పీడీ శివయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఎడి జయరాజు పాల్గొన్నారు.

టిటిడికి 50 టన్నుల కాయగూరలు వితరణ

కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీవారి నిత్యాన్నదానానికి నెలరోజుల వ్యవధిలో 50 టన్నుల కూరగాయలు వితరణగా ఇవ్వడం, పేదలు నివసించే కాలనీలలో ఉచితంగా కూరగాయలు పంపిణీ చేయడానికి మతం అడ్డురాదనే విషయాన్ని కె.జె.మండి యజమానులు దాదాపీర్, ఖాజాపీర్ నిరూపించారని ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళీ కొనియాడారు. గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదానానికి మదనపల్లె కే.జె కాయగూరల మండి నిర్వహకులు దాదాపీర్, ఖాజాపీర్ 12 టన్నుల కాయగూరలు, ఆకుకూరలు వితరణగా అందజేశారు. స్వంతం నిధులతో రెండు వాహనాలను సమకూర్చి కాయగూరలు తిరుమలకు పంపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌డిఒ మురళీ హాజరై జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయడానికి మతం అడ్డురాదనే విషయాన్ని దాదాపీర్, ఖాజాపీర్ వారి సంతానం నిరూపించారని ప్రశంసించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం తిరుమలకు దేశంలోని నలుమూలల నుండి ప్రతిరోజు వేలాది మంది భక్తులు వస్తుంటారని వారికి నిత్య అన్నదానం కార్యక్రమం ద్వారా టిటిడి వారు అన్నప్రసాదం అందిస్తారన్నారు. అటువంటి బృహత్తర కార్యక్రమానికి కెజె కూరగాయల మండీ యజమానులు ఖాజాపీర్, దాదాపీర్ భాగస్వాములు కావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సుధాకర్, ఇమ్రోజ్ పీర్, మస్తాన్, సయ్యద్, ప్రసాద్, మస్తాన్, భానుమూర్తి, కృష్ణారెడ్డి, నారాయణ స్వామి, చంద్ర, గణేష్, వెంకటరమణ, ప్రశాంత్, గంగిరెడ్డి, సుధీర్, ఆది, నరసింహులు, రాణి, రత్నమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ బదిలీ

తిరుపతి ఎస్‌ఇకి ఎఫ్‌ఎసి బాధ్యతలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రావన్ కుమార్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. తిరుపతి నీటిపారుదల శాఖ ఎస్‌ఇగా విధులు నిర్వహిస్తున్న కె.హరినారాయణరెడ్డికి ఎఫ్‌ఎసి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారు. ఆయన రెండ్రోజుల కిందట బాధ్యతలు చేపట్టారు. బదిలీకి గురైన చీఫ్ ఇంజినీర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఇటీవల జిల్లా నీటి పారుదలశాఖ ఇంజినీర్లతో కలిసి నిర్వహించిన అంతర్గత వేశంలో నిబంధనలు పాటించాలని కోరుతూ సహచర ఎస్‌ఇలకు హెచ్చరికలు చేయడం, అన్నమయ్య జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనుల్ని సకాలంలో పట్టాలు ఎక్కించడంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం కారణమైనట్లు తెలుస్తోంది. జిల్లా నీటిపారుదల శాఖ చేపట్టిన ప్రాజెక్టుల పనుల్లో ఇంజినీరింగ్ నిబంధనలు గట్టిగా పాటించాలని కోరడం, పైళ్లను కదలించకపోవడం, తరుచుగా సహచర ఇంజినీర్లకు మెమోలు, వివరణలు కోరడం, రిమార్క్స్ రాయడం వంటి చర్యలు తీసుకున్నట్లు సమాచారం. దీంతో సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో వేగం మందగించినట్లు తెలుస్తోంది. ఇటువంటి కారణాల నేపథ్యంలో ఎన్నికలకోడ్ ఉన్నప్పటికీ కమిషన్ నుంచి అనుమతి తీసుకుని అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ కింద బదిలీ చేసినట్లు సమాచారం. ఆయన్ను తొలుత ఈస్ట్‌కోస్ట్ జిల్లాలకు బదిలీ చేయాలనుకున్నట్లు తెలిసింది. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో జిల్లాలోని క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ చేసినట్లు సమాచారం. ఏదేమైనా రెగ్యులర్ సిఇని బదిలీ చేసి తిరుపతి జిల్లా ఎస్‌ఇకి ఎఫ్‌ఎసి ఇవ్వడం చర్చనీయాంశంగా మారిందని చెప్పవచ్చు.

'లిప్'ను తప్పనిసరిగా అమలు చేయాలి

అన్నమయ్య, కడప జిల్లాల డిఇఒలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి పాఠశాలలో లర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం (లిప్) తప్పనిసరిగా అమలు చేయాలని అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల డీఈవోలు రాఘవ రెడ్డి, దేవరాజు పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ పొందిన మండల విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్, ప్రభుత్వ, నగరపాలక, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ యాజమాన్యాలలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులకు తప్పనిసరిగా లిప్‌ను ప్రతి పాఠశాలలో అమలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడూ ఉప విద్యాశాఖ అధికారులు వీటిపై సమగ్ర నివేదికను డీఈవో కార్యాలయానికి చేరవేయాలని ఆదేశించారు. బుక్కపట్నం డైట్ ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ లిప్‌ను అమలు చేయడం వల్ల విద్యార్థులలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలపై చదవడం, రాయడం సరళంగా నేర్చుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. భాష పై పట్టు రావడం వల్ల మిగిలిన సబ్జెక్టులలో సులభంగా విద్యాభ్యాసం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ సభ్యులు లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడప డిప్యూటీ డిఇఒ రాజగో పాల్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, కడప ఎంఇఒ పాలెం నారాయణ, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా డిఇఒ రాఘవరెడ్డి

ఓర్వలేకనే తిట్ల పురాణం

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప

వైసిపి నాలుగేళ్లల్లో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక, చంద్రబాబు నాయుడు, లోకేష్ ప్రభుత్వంపైనా, సిఎం జగన్‌పైనా వ్యక్తి దూషణలకు, తిట్ల పురాణానికి తెరలేపారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు వారు చేసిన మంచి పనులు చెప్పుకునేందుకు ఏమీ లేకనే సిఎంను విమర్శిస్తున్నారని వాపోయారు. లోకేష్ పాదయాత్రలో జనం లేరనే అసహనంతో ప్రభుత్వంపైనా, వై.ఎస్.జగన్‌పైనా అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల్లో సిర్థస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. లోకేష్‌కు తెలుగులో ప్రావీణ్యం లేక పచ్చిబూతులు మాట్లాడు తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైసిపి నాయకులు కొండయ్య పాల్గొన్నారు.

ఇదేమి కర్మ కార్యక్రమంలో రమేష్‌రెడ్డి

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి : టిడిపి

ప్రజాశక్తి-రాయచోటి

సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 16వ వార్డులో ఇదేమి కర్మ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ టిడిపి పాలనలో చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. పేదలు, రైతులను ఆదుకున్న ఘనత టిడిపిదేనని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. సొంత బ్రాండ్లతో మద్యం అమ్ముతూ పేదలను అన్యాయం చేస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే పేద బలహీన వర్గాలలో వెలుగు నింపాలంటే వైసిపి పాలన పోయి తెలుగుదేశం పార్టీ పాలన రావాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి కక్ష సాధించడం వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు లేక విలవిలలాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక్క ఉద్యోగమైన ఇచ్చారా, ఒక్క పరిశ్రమ అయినా రాష్ట్రానికి వచ్చిందా అంటూ ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష, పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్‌వలి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్ మహబూబ్ భాష ,సయ్యద్ ఫజిల్, సర్దార్ వలీఖాన్, అత్తర్ జావిద్, శేషి జావిద్, ఇలియాజ్, ఫరూక్, సోనిరాజ్ కలిమ్,ముబారక్, అబీద్, హాజీ, మహబూబ్ భాష, రామకృష్ణగౌడ్, సయ్యద్ ఖాన్, మీథేన్, జావిద్, శివారెడ్డి, దుర్గ, ప్రభాకర్ పాల్గొన్నారు.

కడప-బెంగళూరు రైల్వే లైన్ నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కడప నుండి మదనపల్లి మీదుగా బెంగళూరుకు రైల్వే లైన్ నిర్మించాలని చేయాలని సిపిఐ, టిడిపి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ, టిడిపి ఈశ్వరయ్య, దోమలపాటి రమేష్ మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు కడప నుండి మదనపల్లి మీదుగా బెంగళూరుకు 250 కిలోమీటర్ల పొడవు రైల్వే లైను నిర్మాణం చేయాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు కూడా కేంద్రానికి చెల్లించిందని పేర్కొన్నారు. ప్రస్తుత సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ రైల్వే లైన్ గుత్తి మీదుగా బెంగళూరుకు మార్చడం దుర్మార్గమన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఈ ప్రాంతానికి తీవ్రమైన అన్యాం చేశారని విమర్శించారు. ప్రభుత్వం తమ విధానాలను మార్చుకొని రైల్వే లైన్‌ను కడప నుండి మదనపల్లి మీదుగా బెంగళూరుకి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మధుబాబు, ప్రభాకర్, రఘు, సిపిఐ నాయకులు రామానాయుడు, నరసింహులు, కృష్ణప్ప పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఎరువుల అమ్మకం నిలుపుదలకు నోటీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని ఎరువుల దుకాణాలలో జిల్లా వ్యవసాయ అధికారి ద్వారా ఏర్పాటు చేసిన ఎరువుల తనిఖీ అధికారులు బృందం గురువారం పలు ఎరువులు, పురుగులు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ దీక్షకుమారి మాట్లాడుతూ సరైన పత్రాలు అనగా (ఫారం-ఒ) లైసెన్సులు లేని రూ.12.5 లక్షల విలువైన 34 టన్నుల ఎరువులకు అమ్మకపు నిలుపుదల ఆదేశాలు (స్టాప్ సేల్) నోటీసులు జారీ చేయడమైందన్నారు. దుకాణ యజమానులందరూ అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. రైతులకు అమ్మక రసీదులను జారీ చేయాలని ఆదేశించారు. కాలం చెల్లిన ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మదనపల్లి వ్యవసాయ అధికారి నాగప్రసాద్, ఎఒ కృష్ణవేణి పాల్గొన్నారు.

'ఉర్దూ'పై విద్యార్థులు పట్టు సాధించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మైనార్టీ విద్యార్థులు ఉర్దూ భాషను అభ్యసించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్, సెక్రటరీ అయూబ్ హుసేన్ సూచించారు. గురువారం మదనపల్లి పట్టణం స్థానిక మార్వారి వీధిలోని ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రం, ఉర్దూ లైబ్రరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉర్దూ విద్యార్థులు వాటిని సమర్థ వంతంగా ఎదుర్కొనేలా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుందని తెలిపారు. పోటీ ప్రపంచంలో రాణించడానికి విద్యతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని జోడించి ముందుకెళ్లాలన్నారు. అనంతరం స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పరీక్షలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.ఇందులో భాగంగా అయూబ్ హుసేన్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కరీముల్లాను శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాజహాన్, కౌన్సిలర్ ముబీనా, ఉర్దూ అకాడమీ సిబ్బంది షరీఫ్, ఆబిద్, షౌకత్, ఖాజా, మౌలానా, రిటైర్డ్ ఉపాధ్యాయులు అల్లాబక్ష్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

అయూబ్‌హుసేన్, కరీముల్లాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాఠ్యాంశ ప్రణాళికలను పరిశీలిస్తున్న ఎంఇఒ రాజగోపాల్

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

విద్యార్థులకు పాఠ్యాంశాలను అర్థమయ్యేలా బోధించాలని ఎంఇఒ రాజగోపాల్ అన్నారు. గురువారం సైదాపేటలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల పాఠ్యాంశ ప్రణాళికలను, రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టికలను, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థమయ్యేలా బోధించాలని, పాఠ్యాంశాలను అర్థం చేసుకున్నప్పుడే వారు చదువు పట్ల ఆసక్తి కలిగి విద్యపై పట్టు సాధిస్తారన్నారు. ఉన్నత విద్య అభ్యసించడానికి అది దోహద పడుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు అనుసరిస్తున్న పాఠ్యాంశ ప్రణాళికలను పరిశీలించినట్లు తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడకు సమీపంలో ఉన్న దేవళంపేటలో వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి హంస వాహనంపై కోలాటాలు, చెక్కభజనలు, బళ్ళారి డ్రమ్స్, మధ్యలో కలకడ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకల్లో బలిజ సంఘం నాయకులు

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 553వ జయంతి వేడుకలను బలిజ సంఘం మండల అధ్యక్షుడు ఆకుల శ్యాంప్రసాద్, మాజీ సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు కూడలిలో శ్రీకృష్ణదేవరాయల చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ రాజుల చరిత్రలో శ్రీకృష్ణదేవరాయలకు ప్రత్యేకమైన స్థానం ఉందని అన్నారు. ఆయన రాజ్యంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవనం సాగించారని తెలిపారు. సాంస్కృతిక కళలను, వేద పాండిత్యాన్ని పెంచి పోషించారని, ఆయన కాలంలో అనేకమంది కవులు ప్రఖ్యాతి గడించారని అన్నారు. విజయనగర సామ్రాజ్యాన్ని రత్నాలసీమగా మార్చిన ఘనత శ్రీకృష్ణదేవరాయలకు చెందుతుందన్నారు. బలిజలందరూ ఐక్యమత్యంతో ఉంటూ ఆయన ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. నేడు బలిజలకు ఉన్న సమస్యలపై ఐక్యంగా పోరాడుతూ వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిమ్మనపల్లి బలిజ సంఘం నాయకులు వాసు, టీస్టాల్ శివ, ధన, శ్రీకాంత్, తేజ, మెకానిక్ శివ, రెడ్డి బాబు, వెంకటేష్, రామకృష్ణ, వాసు, డ్రైవర్ రెడ్డప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నందలూరు: శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా రాయల్ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాయల్ సేవాసమితి అధ్యక్షులు గంగనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలు వారు చేసిన పనులు గురించి వివరిస్తూ ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌టిసి మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, మాజీ ఎంపిపి పల్లె సుబ్రహ్మణ్యం, టిడిపి మండల అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య, చక్రాల రామ సుబ్బన్న, రాయల్ సేవా సమితి సభ్యులు భరత్, హరి, గంగాధర్, మళ్లీ, లోకేష్, రఫీ, నాగేంద్ర, విజయ్, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జ్ ఎంఇఒగా గంగిరెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

ఇన్‌ఛార్జ్ ఎంఇఒగా గంగిరెడ్డిని సన్మానిస్తున్న ఎంఆర్‌సి సిబ్బంది

మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న డి.గంగిరెడ్డి ఇన్‌ఛార్జ్ ఎంఇఒగా నియమిస్తూ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ డిఇఒ వై.రాఘవరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గంగిరెడ్డి గురువారం ఉదయం ఎంఇఒ కార్యాలయంలో పూర్తి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు అసోసియేట్ అధ్యక్షులు అల్లం అశోక్‌కుమార్, ఎంఆర్‌సి సిబ్బంది రవికిరణ్, వెంకటరమణ, హరినాథ్, సిఆర్‌పి అరుణ జ్యోతిలు ఎంఇఒను దుశ్శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై పట్టభద్రులకు అవగాహన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలో గల పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఎన్నికలపై మండల సచివాలయం కన్వీనర్ రెడ్డిహరి, నాలుగో సచివాలయం కన్వీనర్ కళ్యాణ్‌కుమార్‌రెడ్డి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులైన ఓటర్లు మీ అమూల్యమైన ఓటును వినియోగించు కోవాలన్నారు. అదేవిధంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరచుకోవాలని తెలిపారు. ఇందులో భాగంగా ఒకటో సచివాలయం పరిధిలో కన్వీనర్ చాంద్‌బాషా, అంజమ్మ, పట్టభద్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయాల సెక్రటరీలకు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని ఇంటర్నేషనల్లీ సర్టిఫైడ్ న్యూట్రిషన్ నీలవేణి అన్నారు. గురువారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల హెల్త్ అండ్ హైజిన్ అవేర్నెస్ ప్రోగ్రాం వారియర్ ఆఫ్ వెల్నెస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలు ఆరోగ్యం, వారు ఆహారంలో తీసుకోవలసిన పోషకాలు, వాటి విలువల గురించి వివరించారు. స్త్రీలు పని వత్తిళ్లపై ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కలిగే ఇబ్బందులను ఏ విధంగా పరిష్కరించుకోవాలో సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, యం.నాగ మల్లారెడ్డి, ప్రిన్సిపల్ కె.సతీష్ బాబు, సిఇసి డిపార్ట్మెంట్ ఆర్.త్రివేణి అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

పెద్దమండ్యం : మండలంలోని పెద్దమండ్యం పంచాయతీ బురుజుకుర్వపల్లిలో గురువారం నూతనంగా గ్రామ దేవత మల్లాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేద మంత్రాలతో, మంగళ వాద్యాలు, బాణసంచా వేడుకలు నిర్వహించారు. వేదపండితులతో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు.

CHANGE OF SURNAME

I,NAITHANI BADARUDDEEN, S/o N. ABOOBACKER, D.NO: 11/89, Mahaboob Nagar, Kothapalli, Annamayya dist. Pin : 516269, A.P. Have changed my surname as NAIDANI. BADARUDDEEN (NEW SUR NAME) for future all purposes.

హార్సిలీహిల్స్‌లో స్కౌట్ విద్యార్థుల విన్యాసాలు

ప్రజాశక్తి- బి.కొత్తకోట

స్కౌట్ విద్యార్థులలో ధైర్య సాహసాలు పెంపొందించేందుకు మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్‌లో ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ట్రెక్కింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఒకరోజు పాటు నిర్వహించే ఈ ట్రెక్కింగ్ క్యాంపును గురువారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ సాహస కృత్యాలతో పాటు అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, తుపానులు వంటి విపత్కర పరిస్థితుల నుంచి ఎలా బయట పడాలి, తెలియని ప్రదేశంలో మనుగడ ఎలా సాధించాలనే విషయాలను నేర్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా ఉండాలన్నారు. స్కౌట్‌తో ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విలువలు సమకూరు తాయని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలోని ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా స్కౌట్ విద్యార్థులు ప్రదర్శించిన తాడు సహాయంతో చెట్లను ఎక్కడం, గుట్టలను అదిరోహించడం వంటి సాహస కృత్యాలను పలువురిని ఆకర్షించాయి.

తాడుసాయంతో కొండను ఎక్కుతున్న విద్యార్థులు

కార్యక్రమంలో కొత్తకోటలోని బాయ్స్ ఉన్నత పాఠశాల మదనపల్లిలోని జ్ఞానోదయ పాఠశాల, జిఆర్‌టి పాఠశాల విద్యార్థులతో పాటు అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీకర, సీనియర్ గైడ్ కెప్టెన్ శకుంతలా దేవి, జిల్లా ట్రైనింగ్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, స్కౌట్ మాస్టర్ లక్ష్మిరెడ్డి, గైడ్ టీచర్ తహసీన్ పాల్గొన్నారు.

జాతరకు వచ్చే భక్తులు నిబంధనలు పాటించాలి : సిఐ

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ వరప్రసాద్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గంగమ్మ జాతరకు వచ్చే భక్తులు, చాందిని బండ్ల వారు నియమ నిబంధనలు తప్పక పాటించాలని సిఐ వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో గంగమ్మ జాతరకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొక్కుబడి ఉన్నవారు చాందినీ బండ్లు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. చాందినీ బండ్లు ఎత్తు పది అడుగుల లోపే ఉండాలని సూచించారు. అశ్లీలత నృత్య ప్రదర్శనలు, రికార్డింగ్ డాన్సులు, మైకు సౌండ్ బాక్సులు పెట్టకూడదన్నారు. విద్యుత్తు వైర్లు చాందిని బండ్లకు తగలకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జాతరలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తు న్నామని దొంగతనాలు, మద్యం విక్రయాలు, జూదాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

ఆలయాల్లో రజకులకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-రాయచోటి

ఆలయాల్లో రజక వృత్తిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించి ఆదరించాలని రజక సంఘం అధ్యక్షులు టి రమేష్ బాబు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని 610 ఆలయాల్లో రజకవృత్తిని నమ్ముకొని ఉన్న రజకులకు దేవుడి విగ్రహాల బట్టలు ఉతికే అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో దోబివృత్తిని ఇతరకులకు అప్పగించడం తగదన్నారు. ఇందులో మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించాలని కోరారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని రజకుల జీవనోపాధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు, అసవరమైన యంత్ర పరికరాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. మనిషి పుట్టుక నుంచి మరణం వరకు అన్ని కార్యక్రమాలలో రజకుల పాత్ర ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రజకులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం ఉపాధ్యక్షులు ఎం.వి.రమణ, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై విద్యార్థులకు సూచనలు

ప్రజాశక్తి-కలికిరి

పరీక్ష 4.0 కార్యక్రమంలో భాగంగా ఎస్‌సిపిసిఆర్, ఎస్‌సిఇఆర్‌టి వారి పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా ఎన్నిక చేసుకున్న పది ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డైట్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వై.శ్రీనివాసులురెడ్డి పాల్గొని విద్యార్థులను పరీక్షలకు మోటివేట్ చేయడం ఎలాగో అవగాహన కల్పించారు. విద్యార్థులు టివిలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావడానికి ఓటమి దగ్గరే ఆగిపోకుండా ఓటమికి గల కారణాలను పరిష్కారం దిశగా తోటి విద్యార్థులతో పోలిక సరికాదని అన్నారు. ఎవరికి వారే పోటీ తత్వాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. ఎంఇఒ రంగనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టపడి చదవాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో సిలబస్ సరైన సమయంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంపత్‌కుమార్, జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు, పాల్గొన్నారు.

21న వన్ మ్యాన్ కమిషన్ జిల్లాకు రాక

రాయచోటి : ఈ నెల 21వ తేదీన బెంటో-ఒరియా, బోయ వాల్మీకి సమస్యలపై అధ్యయనం చేసేందుకు వన్ మ్యాన్ కమిషన్‌గా నియమితులైన ఐ.శామ్యూల్ ఆనంద్ కుమార్ జిల్లాకు రానున్నారని కలెక్టర్ గిరీష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో బోయ, వాల్మీకి ఇతర వర్గాల ప్రజలతో బహిరంగ సభ నిర్వహించేందుకు రానున్నారని తెలిపారు.

రైతులు సహకరించాలి : ఎస్‌డిసి

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వేంపల్లి మండలంలోని గిడ్డంగివారి పల్లి గ్రామానికి సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్ పనులకు రైతులు సహకరించాలని పిబిసి ఎస్‌డిసి రమేష్‌రెడ్డి కోరారు. కోమనూతల, ఎగువపల్లి, దిగువపల్లి, మురారి చింతల, చలోపల్లి తదితర గ్రామాల రైతులతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఎస్‌డిసి మాట్లాడుతూ పైప్‌లైన్ వెళుతున్న రైతుల పొలాలకు ఎకరాకు రూ.6.50 లక్షలు ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని తెలిపారు. ఈ పైపులు ఏర్పాటుకు అడ్డంకులు సృష్టించకుండా ఉండాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఆయా గ్రామాల విఆర్‌ఓలు పాల్గొన్నారు.

సిఎం మూడు ముక్కలాట ఆలోచనను మానుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాజధానిని అమరావతి నుండి విశాఖకు తరలించే నిర్ణమైన మూడు ముక్కలాట ఆలోచనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇకనైనా మానుకోవాలని పిసిసి మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి సూచించారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అమరావతిని మార్చే ఆలోచన రాష్ట్రానికి, వైసిపికి మంచిది కాదన్నారు. పండంటి కాపురానికి పన్నెండు సూత్రాలు అన్నట్లు రాజధానిగా అమరావతిని కొనసాగించేందుకు పన్నెండు అనుకూల అంశాలు ఉన్నట్లు చెప్పారు. కొత్తది కోరడం లేదు.. ఉన్న దాన్నే కొనసాగించడమన్నారు. 2014లో అమరావతినే రాజధానిగా అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా జగన్ అసెంబ్లీ సాక్షిగా ఆహ్వానించాడని పేర్కొన్నారు. తమ నాయకుడు ఇక్కడే ఇల్లు కొన్నాడు.. రాజధానిగా అమరావతి కొనసాగుతుందని 2019 ఎన్నికల సందర్భంగా వైసిపి నాయకులు దండోరా వేశారని గుర్తు చేశారు. 2015లో భారత ప్రధానమంత్రి అమరావతిలో శంకుస్థాపన చేశారని తెలిపారు. భారత దేశ పటంలో ఏపి రాజధానిగా అమరావతిని గుర్తించారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాన్ని సర్వనాశనం చేయవద్దని తులసిరెడ్డి సిఎంకు సూచించారు.

నామమాత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించేందుకు మూడు నెలలకొసారి నిర్వహించే మండల సమావేశం గురువారం నామ మాత్రంగా ముగించేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో ఎంపిపి-1 రేణుక, ఉప మండల అధ్యక్షులు పుష్పలత ఆధ్వర్యంలో ఎంపిడిఒ రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయా శాఖల్లో జరిగే అభివృద్ధిపై అధికారులు వివరించారు. పది మంది ఎంపి టిసిలకుగానూ నలుగురు ఎంపిటిసిలు మాత్రమే హాజరయ్యారు. 19 మంది సర్పంచులకు గానూ చింతకుంట సర్పంచు రామ చంద్రారెడ్డి, కొత్త పల్లె సర్పం చు అరుణమ్మ, మంగపట్నం సర్పంచు లక్ష్మిప్రసన్న మాత్రమే పాల్గొ న్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సిడిపిఒ ముంతాజ్‌బేగం, హౌసింగ్ ఎఇ రవికుమార్, ఎఒ వెంకటకృష్ణారెడ్డి, సిహెచ్‌ఒ మహదేవ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రూరల్ మండల పరిధిలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా అదనపు డిఎంహెచ్‌ఒ ఖాదర్‌వలి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం లోని పలు రికార్డులను, రిపోర్టులను పరిశీలించారు. అనంతరం ఆయన వైద్యాధికారి హనీఫ్ బాబాతో మాట్లాడుతూ గర్భిణుల, పిల్లల నమోదు వందశాతం ఉండా లన్నారు. నమోదు చేసిన ఆ వివరాలను, సేవలను 100శాతం ఆర్‌సిహెచ్‌లో నమోదు చేయాలని సూచించారు. అన్ని జాతీయ కార్యక్రమాలపై చర్చించారు. క్షయ నిర్మూలన కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం సాధించిన ప్రగతి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శంకర్, స్టాఫ్ నర్స్ విజయమ్మ, సుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పెట్రోల్ బంకు నిర్వాహకులు నియమ,నిబంధనలు పాటించాలని డిఎస్‌ఒ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక కచేరి రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకును గురువారం ఆయన తనిఖీ చేశారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకులను తనిఖీ చేసినట్లు డిఎస్‌ఒ తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌కు సంబంధించి ప్రత్యేక యాప్ వచ్చిందన్నారు. ఇందులో వారి వివరాలు పూర్తిగా నింపాలన్నారు. బాత్రూం, గాలి మిషన్లు, జనరేటర్లు, స్టాక్‌రేట్లు, కొలతలకు సంబంధించి నియమాలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించామన్నారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సుజిత్, అభిషేక్, విఆర్‌ఒ సాయి ఉన్నారు.

విభిన్నప్రతిభావంతుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఇఒ వీరారెడ్డి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో గురువారం విద్యాభ్యాసం చేస్తున్న విభిన్న ప్రతిభావంతుల విద్యా ర్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ట్రై సైకిల్, సిపి చైర్స్, వీల్‌చైర్‌లను ఎంఇఒ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేకంగా విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఇఆర్‌టి యశోద, రామాంజనేయరెడ్డి, సిఆర్‌పి ప్రకాష్‌రెడ్డి, నాగరాణి, సూర్యకుమారి, కళ్యాణి, సిజివి సుజాత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్ వాయిదా

ప్రజాశక్తి - మైదుకూరు

శుక్రవారం నిర్వహించాల్సిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం వాయిదా పడినట్టు మైదుకూరు డివిజన్ విద్యుత్ ఇఇ జివి రామిరెడ్డి తెలిపారు. మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు బద్వేలు, గోపవరం, అట్లూరు, బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల, కలసపాడు, కాసినాయన, బి.కోడూరు మం డలాల విద్యుత్ వినియోగ దారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

జిల్లా స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

కొండాపురం :మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటుకున్నారు. 2022-23 సంవత్సరానికిగానూ జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు ఈనెల 13,14తేదీల్లో పులివెందుల అహోబిలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.యశస్విని, జె.శిరీష 'ఏకో ఫ్రెండ్లీ' విభాగంలో ద్వితీయ స్థానాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానో పాధ్యాయులు కె.రామయ్య, సైన్స్ ఉపాధ్యాయులు నిర్మల, శివప్రసాద్‌రెడ్డి, అనసూయ, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రస్తుత పోటీ ప్రపంచడంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సార్థకత సాధ్యమని వైసిపి జిల్లా ప్రచార కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి పేర్కొ న్నారు. తన తల్లి సరోజమ్మ వర్ధంతి సందర్భంగా గురు వారం ఆమె జ్ఞాపకార్థం నాగేంద్రారెడ్డి మహి ళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాల నుంచి ప్రతి వర్ధంతి రోజున సరోజమ్మ జ్ఞాపకార్థం పేద వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు.

ఆర్‌బికెలో ఎరువులను పరిశీలిస్తున్న ఎడిఎ రమేష్ బాబు

ఆర్‌బికెలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైతుభరోసా కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎడిఎ జి.రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మండల పరిధిలోని పోలిలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని ఆర్‌బికె కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 45 కిలోల బస్తా ఎరువు రూ.266.50 లకు లభిస్తుందని అన్నారు. మండలం వ్యవసాయ అధికారి జి.రాజకుమారి మాట్లాడుతూ రైతులందరూ పిఎం కిసాన్‌కు ఇకెవైసి చేయించుకోవాలని రైతులకు సూచన, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకుడు పి.చంగల్ రాయుడు, రైతులు పాల్గొన్నారు.

టిడిపి సర్వసభ్య సమావేశానికి హాజరైన పర్వీన్‌తాజ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర తిరుపతి నియోజకవర్గంలో జరగనున్న నేపథ్యంలో టిడిపి సర్వసభ్య సమావేశం గురువారం తిరుపతి నగరంలో జరిగింది. ఈ సమావేశానికి మండలం నుంచి టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్ఎం.పర్వీన్‌తాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో జరిగే యువగళం పాదయాత్ర విజయంవంతం చేయడంపై పార్టీ ప్రముఖులతో కలిసి విధివిధానాలు రూపొందించినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

ప్రజాశక్తి-పీలేరు

వైద్యసిబ్బంది సూచనలు ఇస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

క్షయ వ్యాధి నిర్మూలనలో రూపుదిద్దు కుంటున్న చికిత్సా విధానాలు ప్రజలకు తెలిపి వ్యాధి నిర్మూలనకు పూర్తి బాధ్యత వహిద్దామని క్షయ నిర్మూలన ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిధిలోని మహిళా సిహెచ్‌ఒలకు టిబి వ్యాధి నిర్మూలన నూతన విధానంలో తీసుకోవాల్సిన చర్యల గురించి దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతమున్న క్షయ నివారణా విధానములో వ్యాధి నిర్ధారణ తర్వాత చికిత్స ఉందని, కానీ ప్రధాన మంత్రి టిబి ముక్త భారత అభియాన్ కార్యక్రమంలో క్షయ రోగితో పాటు ఉంటున్న వారికి కూడా ముందస్తు క్షయ వ్యాధి నిర్మూలన పరీక్షలు, మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. క్షయవ్యాధి గ్రస్తులకు బలమైన పౌష్టికాహారం ఇచ్చి ఆదుకునే దాతలను గుర్తించి, రోగికి వ్యాధి విముక్తిని చేయడంలో సహకరిద్దామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆశయంలో భాగంగా 2020-25 నాటికి క్షయ రహిత దేశం కోసం కలసికట్టుగా శ్రమిద్దామన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, టిబి పర్యవేక్షకులు పవన్ కుమార్, మోహన్, సిహెచ్‌ఒలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు వితరణ

ప్రజాశకి-కలికిరి

మేజర్ గ్రామపంచాయతీ కలికిరిలో పారిశుధ్య కార్మికులకు గురువారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ ఆర్ ప్రతాప్ కుమార్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. స్పాన్సర్లు టీఎం వ్యాలీ డైరెక్టర్ కెవై.కృష్ణయ్య, ఎస్‌వియు పాలకమండలి పూర్వ సభ్యులు వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్‌రెడ్డి, అబ్దుల్‌ఖాదర్ మాట్లాడుతూ స్తోమత గల వారందరూ ఎంతో కొంత స్వచ్ఛంద సామాజిక కార్యక్రమాలకు వినియోగించడంలో మానవనీయత దాగుందని అన్నారు. వాననక, ఎండనక అనునిత్యము సమాజం కోసం శ్రమించే పారిశుధ్య సిబ్బందికి ఎంత వితరణ చేసినా తక్కువేనని పేర్కొన్నారు. కార్య క్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రశ్నిస్తే అరెస్టులా?

ప్రజాశక్తి-రాయచోటి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కడపలో భూకబ్జాలు తప్ప, అభివృద్ధి లేదని, అభివృద్ధిపై ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ప్రశ్నించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కడపలో డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా ఆధ్వర్యంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని పేర్కొన్నందుకు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి అక్రమంగా అరెస్టు చేసి ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించడం చాలా దుర్మార్గపు చర్య అన్నారు. కడపలో ప్రతి ఒక్కరూ వైసిపికి ఓటు వేసి బాధపడుతున్నారు. టిడిపి హయాంలో ముస్లిముల కోసం దాదాపుగా రూ. 24 కోట్లతో హాజ్ హౌస్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. కడపలో ఇసుక, భూ, మద్యం మాఫియా చేస్తూ కోట్ల రూపాయలను వైసిపి నాయకులు ఖజానా నింపుకుంటున్నారన్నారు. అభివృద్ధి చెప్పేందుకు ముఖం చాటేసి కేవలం రౌడీయిజమే వారి అభివృద్ధికి చిరునామా మార్చుకున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తప్పక కడప ప్రజలు గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నమండెం మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి హరి అమర్‌నాథరెడ్డి, రాయచోటి రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకటరమణారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షులు సుబ్బయ్య పాల్గొన్నారు.

నందలూరు : టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాలరెడ్డిల అక్రమ అరెస్టు పిరికిపంద చర్యని తెలుగు యుతవ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండిశెట్టి సుదర్శన్ అన్నారు. మంత్రి విసిరిన సవాల్‌ను స్వీకరించి టిడిపి నాయకులు కడప నడిబొడ్డుకు చర్చకు వస్తే అక్రమంగా కడపలో అరెస్టు చేసి, ఒంటిమిట్ట టిటిడి కళ్యాణమండపంలో నిర్బంధించడం తగదన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పుడుతున్న అధికారపార్టీకి వత్తాసు పలుకుతున్న పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

కెజిబివి పాఠశాలలో పరిశీలన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కెజిబివి పాఠశాలను గురువారం ఎల్ఐపిసి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పర్యవేక్షకులు ఎం.వసంత పాఠశాలలోని తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని, నాడు-నేడు పనులను విద్యార్థుల స్థితిగతులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌పిలు నరసింహారావు, కళాశాల ప్రిన్సిపల్ సుచరిత, భారతి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-కలకడ

నాటు సారాను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మండలంలోని దిగుతాండ పంచాయతీ ఎగువ తాండవ వద్ద నాటు సారా తయారు చేస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడులలో దిగువ తాండ పంచాయతీ ఎగువ తాండకు చెందిన చక్రే నాయక్ కుమారుడు సీతారామ నాయక్ 10 లీటర్ల నాటసారని కలిగి ఉండడం గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, పోలీసులు శ్రీనివాసులు, యోగేష్, డ్రైవర్ రమేష్ పాల్గొన్నారు.